మరికొందరికి..

- స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- జిల్లాలో 70 మంది ఉపాధ్యాయులకు అవకాశం

-7లో





నీటిమట్టం తగ్గిన కొడంగల్ పెద్ద చెరువు

వెలవెల

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. జలాశయాలకు వరద పెరిగింది. కానీ వరుణుడు కరుణించక పోవడంతో కొడంగల్ నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లో నీరు లేక బోసిపోయాయి. నెలరోజులుగా తరచూ ముసురు కురుస్తోంది తప్పితే పెద్ద వానల్లేక జలశయాల్లోకి నీరు చేరలేదు. వర్షాలు కురవకపోవడంతో ఆయకట్టు రైతులు దుక్కులు దున్ని చినుకు కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. నీరు లేక హస్నాబాద్, కుదురుమళ్ల, కొడంగల్ పెద్ద చెరువు, పాత కొడంగల్, తదితర చెరువులతో పాటు ఆయా గ్రామాల్లోని కుంటలన్నీ బోసిపోతున్నాయి. గతేడాది ఇదే సమయంలో ఇవన్నీ నిండుకుండలా మారాయి. ఈ వానకాలంలో మాత్రం వాగులు, చెరువుల్లోకి నీరు చేరక నెర్రెలు వారాయి.

- కొడంగల్, జూలై 29

కనుల పండువగా రామలింగేశ్వరుడి పల్లకీ సేవ

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. నిత్య సేవల్లో భాగంగా సోమవారం ఉదయం తెల్లవారు జామున మూలవిరాట్‌కు శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి అధ్వర్యంలో భక్తజన సందోహం నడుమ ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు.

- కీసర, జూలై29



పల్లకీలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నేడు రెండో విడత

రుణమాఫీ

- జిల్లాలో 26,438 మంది రైతులకు లబ్ధి
- రూ.262.64 కోట్లు ఖాతాల్లోకి జమ
- రూ.లక్షన్నర లోపు పంట రుణాలు మాఫీ



మండలం	రైతులు
బంట్వారం	826
బషీరాబాద్	1178
బొంరాస్‌పేట్	1,775
చౌడాపూర్	917
ధారూరు	1,388
దోమ	1,424
దౌల్తాబాద్	2,102
కొడంగల్	2,180
కోట్‌పల్లి	975
కులకచర్ల	1,086
మర్పల్లి	1,845
మోమిన్‌పేట్	1,261
నవాబ్‌పేట్	1397
పరిగి	1,718
పెద్దేముల్	1,544
పూడూరు	1,021
తాండూరు	1,079
వికారాబాద్	1,409
యాలాల్	1,313

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రెండో విడత రైతు రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 31వ తేదీలోగా రెండో విడత రైతు రుణమాఫీ కింద రూ. లక్షన్నర వరకు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారు. జిల్లాలో 2.96 లక్షల మంది రైతులు ఉండగా, వారిలో బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల్లో మొదటి విడత కింద 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్ల రైతు రుణమాఫీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం... రెండో విడత కింద రూ. లక్షన్నర వరకు బ్యాంకుల్లో పంట రుణాలు ఉన్న 26,438 మంది రైతులకు రూ.262.64 కోట్లు మాఫీ చేయాలని నిర్ణయించింది. రూ. లక్షన్నర రుణమాఫీ ప్రక్రియను మంగళవారం ప్రారంభించి బుధవారం పూర్తి చేయనున్నారు. ఏ రైతుకు ఎంత రుణమాఫీ జరగనుందనేది స్పష్టత రాలేదు. జిల్లాలో రెండో విడత రైతు రుణమాఫీకి ఎంత మంది రైతులు అర్హులనేది తెలిసింది. ఈ రైతులకు రూ.262.64 కోట్ల వరకు బ్యాంకుల్లో ఉన్న పంట రుణాలు రద్దు కానున్నాయి. రైతు రుణమాఫీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. వచ్చేనెల ఆగస్టు 15వతేదీలోగా రూ. 2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.



శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ ఏరియల్ వ్యూ

అనంతా.. అంతేనా!

అభివృద్ధికి నోచని అనంతపద్మనాభస్వామి ఆలయం

చుట్టూ ఎత్తైన కొండలు.. పచ్చని చెట్లు.. చూడగానే మైమరిచిపోయే ప్రకృతి సౌందర్యం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. అయితే అనంతగిరి కొండల్లో కొలువుదీరిన అనంతపద్మనాభస్వామి దేవాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. సంవత్సరాలు గడుస్తున్నా... పాలకులు మారుతున్నా ఈ ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వాలు మారినా అనంతగిరి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చనే మాస్టర్ ప్లాన్ రూపొందించినా ప్రతిపాదనల వరకే పరిమితమైంది.

- చారిత్రక నేపథ్యం ఉన్నా పాలకుల ఆదరణ కరువు
- మాడ వీధులకు నోచుకోని దేవాలయం
- దాతలు ముందుకొస్తున్నా పరిష్కారం కాని భూ సమస్య
- సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవపైనే ఆశలు

వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పురాణ, చారిత్రక నేపథ్యం కలిగిన అనంత పద్మనాభస్వామి ఆయలం పాలకుల ఆదరణకు నోచుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత కూడా అనంతగిరి దేవాలయ అభివృద్ధికి ఎలాంటి మంజూరు కాలేవు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో అనంతగిరి కొండల్లో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయ స్థలం వివాదం పరిష్కారానికి నోచుకోని సమస్యగా మారింది. అటవీ, దేవాదాయ, రెవెన్యూ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు చొరవ చూపితే ఒక్కరోజులో పరిష్కారమయ్యే భూ సమస్య... పరిష్కారానికి నోచుకోకుండా దశాబ్దాలుగా కొనసాగుతోంది. భూ సమస్య అనంతగిరి దేవాలయం అభివృద్ధికి తీవ్ర అడ్డంకిగా మారింది.

ఐదెకరాలు డీ నోటిఫై చేసేనా?

అనంతపద్మనాభ స్వామి దేవాలయం మొత్తం 31.20 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ప్రస్తుతం 13.10 ఎకరాలు మాత్రమే దేవాలయానికి ఉంది. దీంట్లో 8.10 ఎకరాల విస్తీర్ణంలో దేవాలయం, దుకాణాలు, పార్కింగ్ స్థలాలు, కల్యాణ మండపాలు ఉండగా, మిగతా 5 ఎకరాలు రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్నట్లు తేల్చారు. దేవాలయం నుంచి పుష్కరిణికి వెళ్లే మెట్లతో పాటు భవనాశిని పుష్కరిణి, శివాలయం, నిజాం నాటి పురాతన నిర్మాణాలన్నీ రిజర్వు ఫారెస్టు పరిధిలోనే ఉన్నట్లు సంబంధిత అధికారులు తేల్చారు. ప్రస్తుతం రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్న 5ఎకరాలను డీ నోటిఫై చేయించడమే కాకుండా దేవాలయం ఎదురుగా ఉన్న బిల్లా దాఖలోని 18.10 ఎకరాలు దేవాలయానికి కేటాయించాలని కోరుతూ ఐదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్న 5ఎకరాల స్థలాన్ని డీనోటిఫై చేయడంతో పాటు దేవాలయానికి బిల్లా దాఖలాలో ప్రతిపాదించిన 18.10 ఎకరాల స్థలం కేటాయిస్తేనే అనంతపద్మనాభస్వామి దేవాలయం అభివృద్ధికి మార్గం సుగమమవుతుంది. యాత్రికులకు కాటేజీలు, మాడవీధులు, సాలారం నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది.



అనంతపద్మనాభస్వామి ఆలయం ఆవరణ

ప్రారంభానికి నోచని పనులు

2001లో అప్పటి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ చొరవతో ఈ దేవాలయం పునరుద్దరణ పనులకు రూ.25 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరు కాగా, ఆ నిధులతో దేవాలయ ముఖ మండపం, మెట్ల నిర్మాణం చేపట్టారు. 2016-17లో పుష్కరిణి వద్ద శివాలయం, హనుమాన్ దేవాలయం, సత్యనారాయణస్వామి వ్రత మండపం తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం రూ.60 లక్షల సీజీఎఫ్ నిధులు కేటాయించింది. అయితే పనులు చేపట్టే స్థలం రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉండడంతో అటవీ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా...

అనంతపద్మనాభస్వామి దేవాలయం అభివృద్ధికి అడ్డంకిగా మారిన భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ గత ప్రభుత్వంలో అప్పటి దేవాదాయ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రస్తుత మంత్రి కొండా సురేఖ దృష్టికి దేవాలయ నిర్వాహకులు తీసుకు వెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చిన ప్రతిసారి అనంతగిరి కొండలు, అనంతపద్మనాభస్వామి దేవాలయం గురించి ప్రస్తావించేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నా... అనంతపద్మనాభస్వామి దేవాలయం అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడం గమనార్హం.

మాస్టర్ ప్లాన్‌కే పరిమితం..

అనంత పద్మనాభస్వామి దేవాలయానికి 200ఎకరాల వరకు ఆలయ భూములు ఉంటాయి. ఈ భూములను మూడేళ్లకోసారి కౌలుకు ఇచ్చేందుకు వేలం వేస్తారు. భూములపై వచ్చే కౌలు ఆదాయం, హుండీ ఆదాయంతోనే దేవాలయం నిర్వహణ కొనసాగుతోంది. దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నా స్థల వివాదం కారణంగా పనులు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపద్మనాభస్వామి దేవాలయాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చనే మాస్టర్ ప్లాన్ రూపొందించినా ప్రతిపాదనల వరకే పరిమితమైంది. ఇదిలా ఉంటే, దర్శన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం దేవాలయం ముందు భాగంలో రూ.50 లక్షలతో క్లాక్‌రూం, పార్కింగ్ స్థలాలను అభివృద్ధి పరచాలని ప్రతిపాదించారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇంకా ఉత్తర్వులు జారీ కాలేదని తెలిసింది.

సీఎం, అసెంబ్లీ స్పీకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే

కోరిన కోరికలు సాకారం చేసే దేవుడిగా పేరొందిన అనంతపద్మనాభస్వామి దేవాలయం అభివృద్ధికి జిల్లా నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే అనంతగిరి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అనంతగిరి దేవాలయం అభివృద్ధి పరిచే విషయాన్ని దేవాలయ నిర్వాహకులు స్పీకర్, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖల దృష్టికి తీసుకు వెళ్లారు. సీఎం అనంత పద్మనాభస్వామి దేవాలయంపైన కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవసరమైన నిధులు కేటాయించి ఆధ్మాత్మిక కేంద్రంగా అభివృద్ధి పరచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.






పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- నేర ప్రవృత్తి గలవారిపై నిరంతర నిఘా
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముందుకు..
- తాండూరులో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరుస్తాం
- మహిళల భద్రత, పిల్లల సంరక్షణపై దృష్టి
- సరిహద్దు చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎస్పీ నారాయణరెడ్డి

బషీరాబాద్, జూలై 29: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. ఎక్సైజ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా గంజాయి నివారణకు ప్రణాళితతో దాడులు నిర్వహిస్తామన్నారు. సోమవారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఆయన అనంతరం విలేకర్లతో మట్లాడారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి జిల్లా పోలీస్ శాఖ డ్రంకెన్ డ్రైవ్ కేసులపై దృష్టి పెట్టిందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల భద్రత, పిల్లల సంరక్షణకు ప్రత్యేక దృష్టి పెడతామన్నారు, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మార్యద ప్రవర్తించి వారిచ్చే ఫిర్యాదుదారులపై వెంటనే స్పందించేలా పోలీస్ యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో నేర ప్రవృత్తి గల వారిపై నిరంతర నిఘా పెడతామన్నారు. అక్రమ రవాణాపై సరిహద్దు గ్రామల్లో నిఘా ముమ్మరం చేశామని వెల్లడించారు. కొత్త తరహాలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్పీ తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్‌కుమార్‌లతో ప్రత్యేక సమావేశమైన పలు అంశాలపై చర్చించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన కేసుల పురోగతిపై ఆరా తీశారు. డయల్ 100, రోడ్డుప్రమాదాలు, సైబర్‌నేరాలపై ఎస్పీ సమీక్షించి పోలీస్ అధికార, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దస్త్రాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలని ఎస్ఐ రమేష్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీవెంట తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ ఆశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



సీసీఐ కర్మాగారం

కరన్‌కోట్ సీసీఐలో సాంకేతిక లోపం

- నిలిచిపోయిన సిమెంటు ఉత్పత్తులు
- మరో 15రోజుల వరకు బ్రేక్?

తాండూరు రూరల్, జూలై 29: తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామ శివారులోని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతున్న సీసీఐ కర్మాగారంలో సాంకేతిక లోపం కారణంగా సిమెంటు ఉత్పత్తులకు బ్రేక్ పడింది. దీంతో సిమెంటు ఉత్పత్తులు చేసేందుకు మరో 15రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. సీసీఐ కర్మాగారంలో పిల్లర్‌కు సంబంధించిన సాఫ్ట్ విరిగిపోవడంతో సోమవారం మధ్యాహ్నం సిమెంటు ఉత్పత్తులు నిలిచిపోయాయి. కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలో గతనెల 27వ తేదీ కూడా సాంకేతిక లోపం కారణంగా సిమెంటు ఉత్పత్తులకు బ్రేక్ పడగా, ఈనెల 18న సీసీఐ యాజమాన్యం మరమ్మతులు చేపట్టి ఉత్పత్తులను ప్రారంభించింది. అయితే కర్మాగారంలో యంత్రాలు గత 45ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి కావడంతో తరచూ సాంకేతికలోపం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పుడు కూడా మరమ్మతులు చేపట్టేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. దీంతో సిమెంటు ఉత్పత్తులు నిలిచిపోయినట్లు సమాచారం.

టీటీడీ బోర్డు సభ్యుడిగా నందారం ప్రశాంత్?



నందారం ప్రశాంత్

కొడంగల్, జూలై 29: ప్రసిద్ధి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా కొడంగల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌కు అవకాశం దక్కనుందనే ప్రచారం కొనసాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబానికి నమ్మకస్తుడిగా ప్రశాంత్ కొడంగల్‌లో అన్నీ తానై ఉంటూ గుర్తింపు పొందారు. నందారం కుటుంబీకులు తెలుగు దేశం పార్టీలో కొనసాగుతూ ఎమ్మెల్యేలుగా, టీటీడీ బోర్డు సభ్యులుగా పదవుల్లో కొనసాగారు. నందారం వెంకటయ్య, సూర్యనారాయణ అకాల మరణం అనంతరం నందారం ప్రశాంత్ తెరపైకి వచ్చారు. నాటి నుంచి నేటి వరకు నందారం కుటుంబీకులైన ప్రశాంత్ రేవంత్‌రెడ్డికి, సోదరుడు తిరుపతిరెడ్డికి నమ్మకస్తుడిగా కొనసాగుతున్నారు. టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన నందారం కుటుంబీకులు నందారం వెంకటయ్య, సూర్య నారాయణ మృతి తర్వాత నాయకత్వ లోపం ఏర్పడింది. దీంతో టీడీపీ అధినేత, ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు 2009లో టీడీపీ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించి కొడంగల్‌కు పంపించారు. కొంత కాలంలోనే నందారం కుటుంబీకుల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డికి మద్దతు తెలిపి గెలిపించారు. దివంగత మాజీ ఎమ్మెల్యేలు నందారం వెంకటయ్య, సూర్యనారాయణ వారి కుటుంబం నుంచి అంచెలంచెలుగా రాజకీయాల్లో రాణిస్తూ నందారం ప్రశాంత్ గుర్తింపు పొందారు. గతంలో నందారం కుటుంబం నుంచి నందారం సూర్యనారాయణ టీటీడీ బోర్డు సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో నందారం కుటుంబానికి సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, సతీమణి గీతారెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భావించడం ప్రశాంత్‌కు సముచిత స్థానం దక్కనుందనే ప్రచారం కొనసాగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పూర్తితో టీటీడీ బోర్డు చైర్మన్ నియామకంలో బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కనుందని సమాచారం. దీంతో పాటు టీటీడీకి అనుసంధానంగా కొడంగల్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఏదిఏమైనా నందారం కుటుంబం నుంచి ప్రశాంత్‌కు సముచితస్థానం కల్పిస్తారనే పార్టీ వర్గాల్లో ప్రచారం కొనసాగుతోంది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పరిగి, జూలై 29: మునిసిపల్ పరిధిలోని 13,14 వార్డులకు కలిపే రోడ్డుకు సీసీ రోడ్డు పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ రోడ్డుతో రెండు కాలనీల వారికి సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు కృష్ణ, మీరుతాహేర్‌అలీ, నసీమోద్దీన్, మాజీద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లు ఇక పంచాయతీ కార్యదర్శులు

- ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీ రాజ్ శాఖ
- గత ప్రభుత్వంలో పోరాటం
- జేపీఎస్‌ల సమస్యలు తీర్చిన రేవంత్ సర్కార్

తాండూరు, జూలై 29: పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్)లకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. జూనియన్ పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగుతున్న అర్హత ఉన్న వారిని పంచాయతీ కార్యదర్శులుగా గుర్తిస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో జేపీఎస్‌లు ఇక పంచాయతీ కార్యదర్శులు స్కేలును పొందనున్నారు. వికారాబాద్ జిల్లాలో 20మంది, రంగారెడ్డి జిల్లాలో 40మంది అర్హత పొందారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సర్వీసు రెగ్యులరైజేషన్, జేపీఎస్ నుంచి పంచాయతీ కార్యదర్శులుగా మార్చేందుకు 13రోజుల పాటు నిరసన దీక్షలను చేసి పోరాటం చేసిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోపే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పరిష్కరించింది.

ప్రయోజనాలు

జూనియన్ పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగే వారికి గౌరవ వేతనం రూ.15వేలు ఉండగా, వారికి ప్రమోషన్లు ఉండేవి కావు. ఉద్యోగ భద్రత ఉండేది కాదు. జేపీఎస్ నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శిగా గుర్తింపు పొందడంతో 24,280-72,850 పేస్కేలు పొందడమే కాకుండా అదనపు అలవెన్సులను పొందుతారు. పంచాయతీరాజ్ చట్టం-2018ను అనుసరించి పంచాయతీ కార్యదర్శులుగా జిల్లా కలెక్టర్లు నియామక పత్రాలను అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హోదా పెరగడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలను పొందుతారు. దాదాపు రూ.12వేల జీతం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

శస్త్ర చికిత్సలకు బ్రేక్



తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి



ఆపరేషన్ థియేటర్‌కు వేసిన తాళం

- సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ బదిలీతో కష్టాలు
- పరికరాలు అందుబాటులో ఉన్నా సర్జన్‌ల లోటు
- ఆపరేషన్ థియేటర్‌కు తాళం
- భర్తీ చేయకుంటే రోగులకు కష్టాలే

తాండూరు, జూలై 29: తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు బ్రేక్ పడింది. శస్త్ర చికిత్సలు చేసే వైద్యులు బదిలీల్లో వెళ్లిపోవడం, వచ్చే వారిలో శస్త్ర చికిత్సలు చేసే డాక్టర్లు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు అవసరమయ్యే ఆపరేషన్ థియేటర్, స్కానర్ వంటి ఆపరేషన్లు చేసే వైద్యులు లేక శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. సర్జన్స్ లేని కారణంగా హైదరాబాద్ నగరం లేదా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్లతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తాండూరు జిల్లా ఆస్పత్రి పరిధిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆస్పత్రి నుంచి ఒకే సారి 11మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఐదుగురు మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చిన వారంతా స్పెషలిస్టు వైద్యులు కావడంతో జనరల్ సర్జన్ లేక ఆపరేషన్లు చేయలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగిన డాక్టర్ మూర్తి ప్రతీ నెల 30 నుంచి 40 సర్జరీలు చేసేవారు. అయితే, ఆయన మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి ఏరియా ఆస్పత్రికి ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జనరల్ సర్జన్ ఎవరూ లేని కారణంగా శస్త్ర చికిత్సలు జరుగడం లేదు. తాండూరు జిల్లా ఆస్పత్రికి ఇరత ప్రాంతాల నుంచి డెర్మటాలజిస్ట్ డెంటల్, పెర్మటాలజిస్ట్ స్పెషాలిస్ట్ సర్జన్లు బదిలీపై వచ్చారు. వీరిలో ఎవరూ శస్త్ర చికిత్సలు చేసే వారు కాదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నారు.

పెరుగుతున్న రోగుల తాకిడి

తాండూరు నియోజకవర్గ ప్రజలతో పాటు అటు కొడంగల్ ప్రాంత ప్రజలు, ఇటు కర్ణాటక ప్రాంత ప్రజలు నిత్యం వందలాది మంది రోగులు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తుంటారు. 200 పడకల ఆస్పత్రి కాగా, శస్త్ర చికిత్సకు కావల్సిన అన్ని రకాల పరికరాలు అందుబాటులోనే ఉన్నాయి. దీంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. హైడ్రోసెల్, హెర్నియా, అపెండెక్స్ వంటి శస్త్ర చికిత్సలు చేసేవారు. అయితే, ప్రస్తుతం ఈ ఆపరేషన్లకు అవసరమైన సర్జన్లు లేరు. ఆపరేషన్లు అవసరమైన పేదలను హైదరాబాద్, ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

11మంది బదిలీ

తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఒకేసారి 11మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. బషీరాబాద్ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మారడంతో పాటు వైద్య విధాన పరిషత్‌లోకి మారింది. దీంతో స్థానికులైన, అనుభవం కలిగిన వైద్యులు బషీరాబాద్‌కు బదిలీ అయ్యారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న అనసిషియన్లు రవిశంకర్, శరత్, శ్రీధర్‌గౌడ్, ఫిజియన్ ప్రవీణ్‌గౌడ్‌లు బషీరాబాద్ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. వీరందరూ డిప్యూటీ సివిల్ సర్జన్లు. బదిలీపై వెళ్లిన వారిని డిప్యూటేషన్‌పై రప్పించడం లేదా జనరల్ సర్జన్లను రప్పిస్తేనే జిల్లా ఆస్పత్రిలో పేదలకు కావాల్సిన వైద్యసేవలు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తా



తాండూరు ఆస్పత్రి సిబ్బంది కొరత విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నర్సింహా దృష్టికి తీసుకెళ్తాను. ఖాళీల భర్తీ, శస్త్ర చికిత్సలు చేసేందుకు అవసరమైన డాక్టర్లను నియమించేలా చూస్తా. రెండు జిల్లాల ప్రజలకు, కర్ణాటక ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ఈ ఆస్పత్రి ఎంతో ఉపయోగపడుతుంది. అంతరాయం ఏర్పడుతున్న వైద్య సేవలను మళ్లీ పునరుద్ధరించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పాఠశాలలో వైభవంగా బోనాలు



బోనాలతో చిన్నారులు

తాండూరు, జూలై 29: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని తాండూరులోని శివాజీచౌక్‌లో గల శ్రీసాయి మేధ విద్యాలయంలో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పాఠశాలలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారితో పాటు శివాజీ చౌక్‌లోని సారమ్మ మాతకు విద్యార్థులకు భక్తిశ్రద్ధలతో బోనమెత్తి నైవేద్యాలు సమర్పించారు. చక్కటి చదువుతో పాటు ఇంటిల్లిపాదిని చల్లంగా చూడు తల్లీ అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులకు, డీజే పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీసాయి మేధ విద్యాలయ కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో భాగంగా తెలంగాణలో వైభవంగా నిర్వహించే బోనాల గురించి క్లుప్తంగా విద్యార్థులకు తెలిపేందుకు పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమ్ముకున్న కారుమబ్బులు



తాండూరులో కమ్ముకున్న మేఘాలు

తాండూరు, జూలై 29: తాండూరును కారుమబ్బులు కమ్ముకున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షంతో ఇబ్బంది పడిన చిరు వ్యాపారులకు కాస్త ఊరట లభించింది. రోడ్లపై తోపుడుబండ్లపై యథావిధిగా వ్యాపారం చేసుకుంటున్నారు. రైతులు పొలాల్లో వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. వరి నాట్లు, కలుపు మొక్కలు తీయించడం వంటి పనులను చేపట్టారు. రోజూ వారీ కూలీలకు మూడు రోజుల నుంచి కాస్త ఉపాధి లభించినట్లైంది. తాండూరు నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, వాగులు నీటితో కళకళలాడుతున్నాయి. పలు కాలనీల్లో ముసురు వర్షానికి రోడ్లు చిత్తడిగా మారాయి. రోడ్లపై గుంతల్లో చేరిన వర్షపు నీటితో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాండూరు పట్టణంలో పలు కాలనీల్లో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు.

గురుకుల్ బుక్ అఫ్ ది ఇయర్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మహిపతి శ్రీనివాస్‌రావు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 29: మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ అడ్మిషన్ డీన్ మహిపతి శ్రీనివాస్‌రావుకు గురుకుల్ బుక్ అఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. శ్రీనివాస్‌రావు రాసిన 'స్పీక్ టూ రీచ్ పీక్స్' అనే పుస్తకం విద్యార్థులకు, ఉద్యోగులకు, పారిశ్రామికవేత్తలకు వారి వ్యక్తిగత, భావ వ్యక్తీకరణ నైపుణ్యతతో పాటు ఉపన్యాస కళలను పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహపడుతున్నందున గురుకుల్ బుక్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు గురుకుల్ ప్లబిష్ ఫౌండర్ వినీత్ గూరా, బెంగళూరు జీరోడిఫెక్ట్ కన్సల్టెన్సీ సీఈవో డాక్టర్ ఎం జగదీష్‌ల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తాను రాసిన స్పీక్ టూ రీచ్ పీక్స్ బుక్ అమెజాన్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగుల వ్యక్తిగత నైపుణ్యాలకు, వృత్తి నైపుణ్యాలకు దోహపడిందన్నారు. ఈ పుస్తకానికి గతంలోనే అమెజాన్ బెస్ట్ సెల్లర్ అవార్డు ఇచ్చిందని గుర్తుచేశారు. దీంతో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమా, వైస్ చాన్సలర్, అధ్యాపకులు శ్రీనివాస్‌రావును అభినందించారు.

రూట్ నంబర్ 592లో ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ నుంచి శివారు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. కొత్తగా 592 రూట్‌లో మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికి 3 బస్ ట్రిప్పులు నేటి(మంగళవారం) నుంచి నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికిఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.55 నిమిషాలకు, కందవాడ గ్రామం నుంచి మెహిదీపట్నంకు ఉదయం 9.25, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 5.10 నిమిషాలకు బస్ ట్రిప్పులు అందుబాటులో ఉంటాయన్నారు. మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సులు మెహిదీపట్నం నుంచి వయా నానల్ నగర్, లంగర్‌హౌస్, టీకేబ్రిడ్జి, బండ్లగూడ క్రాస్‌రోడ్, అరెమైసమ్మ, అప్పా, గోల్డెన్ ఫామ్స్, ఉస్మాన్‌సాగర్ క్రాడ్ రోడ్స్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ క్రాస్‌రోడ్, మొయినాబాద్, కనకమామిడి ఎక్స్‌రోడ్, కేతిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్, అప్పారెడ్డి గూడ క్రాస్‌రోడ్, టోల్‌కట్టా క్రాస్‌రోడ్, ముడిమల్ క్రాస్‌రోడ్, కందవాడ ఎక్స్‌రోడ్, మల్లాపూర్, కాసారం, కందవాడ, చేవెళ్ల వరకు బస్సులు నడుపుతామన్నారు.

అంబేడ్కర్ చూపిన మార్గం

అందరికీ అనుసరణీయం



అంబేడ్కర్ నాటక ప్రదర్శనలో పాల్గొన్న సంఘాల నాయకులు

ఆమనగల్లు, జూలై 29: అంబేడ్కర్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు దాసురామ్ నాయక్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు శ్రీనివాస బహదూర్ అన్నారు. అసమానతలు పూర్తిగా తొలగిపోయి రాజ్యాంగ ఫలాలు పేదల దరిచేరినప్పుడే అంబేడ్కర్‌కు అసలైన నివాళి అని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో ఆదివారం రాత్రి అంబేడ్కర్ నాటిక ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ, డీబీఎస్‌యూ, రైతు సంఘం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కానుగుల వెంకటయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు పర్యవేక్షణలో నిర్వహించిన నాటికకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు దాసురామ్ నాయక్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు శ్రీనివాస బహదూర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు దరువుల శంకర్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ జోగు రమేశ్, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, కానుగుల జంగయ్య, బాలయ్య, టైగర్ జంగయ్య, నర్సింహ, ఆశ్వ యాదయ్య, మల్లేశ్, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

మిర్చి రైతు కన్నీరు



వర్షాలకు పాడైన మిర్చిపంట, బాధిత రైతు

పెద్దేముల్, జూలై 30: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం మిర్చిపంటకు నష్టాన్ని మిగిల్చింది. మండల కేంద్రానికి చెందిన మాలె సంతోష(బసమ్మ) వేసిన మిర్చి పంట వర్షాలకు మురిగిపోయాయి. మూడెకరాల్లో మిర్చిసాగు చేస్తే అరెకరం వరకు పంట మురిగిపోయి రూ.40వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయింది.

మతతత్వ పార్టీలను సాగనంపుదాం



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు సోమయ్య

నందిగామ, జూలై 29: మతతత్వ పార్టీలను సాగనంపాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య అన్నారు. సోమవారం నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి శివారులోని కాకా గెస్ట్‌హౌస్‌లో సీపీఎం రంగారెడ్డి జిల్లా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సోమయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో మతతత్వ శక్తులు రాజకీయ రంగంలోకి చొరబడి సమాజాన్ని అభివృద్ధి చెందనీయకుండా, కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నాయని ఆరోపించారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చేప్పేవిధంగా సీపీఎం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టి, ఆ పార్టీల నిజస్వరూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామ్యేల్, భాస్కర్, రాజు, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీను నాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీల అమలులో మోడీ విఫలం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేశ్

శామీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర విజభన హామీలను అమలు పర్చడంలో ప్రధాని నరేంద్రమోడీ ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేశ్ ధ్వజమెత్తారు. శామీర్‌పేటలో సోమవారం సీపీఐ మండల కార్యదర్శి నరేంద్రప్రసాద్ అధ్యక్షతన ఉమ్మడి శామీర్‌పేట మండల సీపీఐ నిర్మాణకౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేశ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పదేళ్లు గడిచినా ప్రధాని నరేంద్రమోడీ అమలు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని ఇవ్వడంలో, నిధుల కేటాయింపులో ప్రధాని నరేంద్రమోడీ ఘోరంగా విఫలమయ్యారని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ సంస్థల ఆస్తుల పంపిణీలో రాష్ట్రానికి ఒక్క హామీని అమలు పర్చలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు దశరథ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహా, సీపీఐ సహాయ కార్యదర్శి చంద్రయ్య, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా నరేంద్రప్రసాద్

సీపీఐ శామీర్‌పేట మండల నూతన కార్యదర్శిగా శామీర్‌పేట గ్రామానికి చెందిన నరేంద్రప్రసాద్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నుకున్నారు. శామీర్‌పేటలో ఉమ్మడి మండల సీపీఐ పార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ మండల సహాయకార్యదర్శులుగా అనిత, ఓంకార్, మురళీధర్‌రాజు, 13మందితో నూతన కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా మూడుచింతలపల్లి మండల సీపీఐ నూతన కార్యదర్శిగా రాములుగౌడ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా 11మందిని మండల నూతన కమిటీ కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

ముగిసిన పౌరాణిక నాటక పోటీలు

విజేతలకు నగదు బహూకరణ



పౌరాణిక నాటక ప్రదర్శన

షాద్‌నగర్‌అర్బన్, జూలై 29 : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీవాణి సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక పోటీలు ముగిశాయి. షాద్‌నగర్ గణేష్ గార్డెన్‌లో శనివారం ప్రారంభమైన నాటక పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో 24 కళాబృందాలు భక్త చింతామణి, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, శ్రీరామాంజనేయ యుద్ధం, బాలనాగమ్మ, శ్రీసత్య హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, రాజసూయ యాగం, శ్రీకృష్ణ తులాభారం తదితర నాటకాలను ప్రదర్శించారు. పోటీల్లో న్యాయనిర్ణేతలుగా సాల్వాచారి, భవానీజగదీశ్వర్‌రెడ్డి, రామాచారి, ద్రోణాచారి వ్యవహరించారు. పోటీల్లో మహమ్మదాబాద్ మండలం దేశాయపల్లికి చెందిన మైత్రి కళా పరిషత్‌కు మొదటి బహుమతి, పాలమూరుకు చెందిన స్వరళహరి కల్చరల్ అకాడమీకి రెండో బహుమతి, జడ్చర్ల మండలం గంగాపురానికి చెందిన శ్రీ నవజ్యోతి కళానాట్యమండలికి మూడో బహుమతి లభించాయి. ముగింపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కరీంనగర్ మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ ప్రాంత కార్యవాహ బండారి రమేష్, పౌల్ట్రీ పారిశ్రామిక వేత్త పాతూరి వెంకట్‌రావు, విద్యావేత్త ఎన్వీ.రాజేంద్రప్రసాద్, శ్రీవాణి సంస్కృతిక సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కోశాధికారి ఎస్.గోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.సురేష్, కోశాధికారి గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవ.. గుంతలు పూడ్చివేత



ఫత్తేపురం బ్రిడ్జి వద్ద గుంతలను పూడ్చివేయిస్తున్న సీఐ వెంకటేశం

శంకర్‌పల్లి, జూలై 29: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురం బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలను ట్రాఫిక్ పోలీసులు సోమవారం పూడ్చివేయించారు. వర్షాలకు రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడగా.. వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం స్థానికులతో మాట్లాడి మొరం(మట్టి) తెప్పించారు. జేసీబీ సహాయంతో గుంతలను చదును చేయించారు. ఫత్తేపురం-శంకర్‌పల్లి వద్ద గల తీగలవాగు, ఫత్తేపురం బ్రిడ్జి వద్ద ఏర్పడిన గోతులను పూడ్చించడం పట్ల స్థానికులతో పాటుగా వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు చేయాల్సిన పనిని ట్రాఫిక్ పోలీసులు చేయడంపై పలువురు ప్రశంసలు కురిపించారు. కాగా, శంకర్‌పల్లి చౌరస్తా నుంచి ఫత్తేపురం వరకు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా, శంకుస్థాపన చేసి నాలుగు సంవత్సరాలు కావస్తోంది. నిత్యం వాహనదారులు నరకం అనుభవిస్తున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారుల్లో ఉలుకూ.. పలుకూ లేకపోవడం పట్ల పలువురు మండిపడుతున్నారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేస్తే ఈ తిప్పలు ఉండవు కదా.. అని స్థానికులు చర్చించుకున్నారు.

రాచకొండలో రహదారి భద్రతకు 'ఆప్ట్'



- రోడ్డు ప్రమాదాల విశ్లేషణ, నివారణే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీపీ

హైదరాబాద్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. వేల మంది క్షతగాత్రులు వికలాంగులుగా మారి దు ర్భర జీవితాన్ని గడుపుతున్నారు. భద్రతకు పెద్ద పీట వేసి రోడ్డు ప్రమాదాలను గణ నీయంగా తగ్గించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు సంకల్పించారు. అందుకోసం ఆప్ట్ (ఏపీటీ) అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ప్రమాదాలపై విశ్లేషణ..

కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి, ప్రమాదం జరగడానికి గల కారణాలను తెలుసుకోవడానికి, మరోసారి అక్కడ ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవడానికి సీపీ ప్రత్యేకంగా యాక్సిడెంట్స్ ఎనాలసిస్, ప్రివెన్షన్ టీమ్ (ఆప్ట్) ను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఈ బృందం ఘటనా స్థలాని కి చేరుకుంటుం ది. స్థానిక పోలీ సుల సహకారం తో సంఘటనా స్థలంలోని ఆధారాలను సేకరిస్తుంది. అక్కడి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు, యాక్సిడెంట్‌కు గల కారణాలు తెలుసుకుంటారు. గతంలో అక్కడ తరచూ యాక్సిడెంట్స్ జరిగితే ఆ ప్రాంతమైతే దాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తిస్తారు. ఒకవేళ రోడ్డు నిర్మాణలోపం, ఇంజనీరింగ్ తప్పిదాలు, యూటర్న్‌లు, కర్వ్ వంటి కారణాలతో యాక్సిడెంట్ జరిగితే ఆ విషయాన్ని ఆధారాలతో సహా.. విశ్లేషించి రిపోర్టు తయారు చేస్తారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ, ఇంజనీరింగ్ విభాగం, నేషనల్ హైవే అథారిటీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై గుర్తించిన కారణాలను సంబంధిత శాఖల అధికారుల దృష్టి తీసుకెళ్తారు. ఆ శాఖల సమన్వయంతో లోపాలను సరిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు. ఆప్ట్ బృందం చేస్తున్న విశ్లేషణతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడంతో పాటు.. రహదారి భద్రతకు సీపీ పెద్దపీట వేస్తున్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో సహకారం..

ఆప్ట్‌తో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి ప్రయత్నించడంతో పాటు.. హిట్ అండ్ రన్ కేసులను సైతం ఛేదించేందుకు ప్రత్యేక బృందం కృషి చేస్తున్నట్లు తెలిసింది. ప్రమాదాలను విశ్లేషించే క్రమంలో అక్కడ ప్రమాదం హిట్ అండ్ రన్ అయితే సీసీ టీవీలను విశ్లేషిస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం చేసి ఆపకుండా వెళ్లిపోయిన వాహనాన్ని సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన టెక్నికల్ ఎవిడెన్స్‌తో గుర్తిస్తున్నారు. ఆ ఆధారాలను లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఇచ్చి హిట్ అండ్ రన్ ప్రమాదాలను ఛేదించడంలోనూ సహకారం అందిస్తున్నట్లు తెలిసింది. దాంతో ప్రమాదంలో మృతిచెందిన వారికి, క్షతగాత్రులకు సకాలంలో న్యాయం జరిగడంతో పాటు.. నిందితులకు శిక్షపడే అవకాశం ఉంది.

మరికొందరికి..

- స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- జిల్లాలో 70 మంది ఉపాధ్యాయులకు అవకాశం



వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో మిగిలిపోయిన ఖాళీల్లో మరికొందరికి అవకాశం కల్పించారు. జిల్లాలో గత నెలలో జరిగిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో వివిధ కారణాలతో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను అర్హత కలిగిన సీనియర్ ఉపాధ్యాయులకు కేటాయించే విధంగా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. జిల్లాలో పదోన్నతులతో భర్తీ చేయాల్సిన స్కూల్ అసిస్టెంట్, ఆ స్థాయి పోస్టులు 78 ఖాళీగా ఉండగా, తాజాగా నిర్వహించిన పదోన్నతుల్లో 70 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. మ్యాథమెటిక్స్‌లో ఇద్దరికి, ఫిజికల్ సైన్స్‌లో ఆరుగురికి, ఇంగ్లీష్ పది, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పద్నాలుగు, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఆరుగురికి, బయోలాజికల్ లో ఏడుగురికి, స్కూల్ అసిస్టెంట్ హిందీలో ఇద్దరికి, ఉర్దూలో ఒకరికి, తెలుగులో ఐదుగురికి, సోషల్ స్టడీస్‌లో పదిహేను మందికి, ఫిజికల్ డైరెక్టర్‌గా ఇద్దరికి పదోన్నతి లభించింది. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు పది ఖాళీలు ఉండగా, కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే అర్హులు ఉండడంతో ఆ ఇద్దరికే పదోన్నతి లభించింది. ఆదివారం వెబ్ ఆప్షన్లు క్లోజ్ కాగా, ఆప్షన్లు ఇచ్చిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ పాఠశాలలను కేటాయించారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో మంగళవారం చేరాల్సి ఉంటుంది.

జిల్లాలో 733 మందికి పదోన్నతులు

గత నెలలో ప్రారంభమైన పదోన్నతుల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. గత నెలలో అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంటకు జీహెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. అప్‌గ్రేడేషన్ పొందిన భాషా పండితుల బదిలీలు నిర్వహించి పోస్టింగులు ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల్లో జిల్లాలో మొత్తం 733 మందికి పదోన్నతులు లభించాయి. జీహెచ్ఎం పోస్టుల పదోన్నతులు మల్టీ జోన్ -2 పరిధిలో జరగగా, స్కూల్ అసిస్టెంట్, ఆ సమాన స్థాయి పదోన్నతులు జిల్లా స్థాయిలో జరిగిన విషయం తెలిసిందే. గత నెలలో జరిగిన జీహెచ్ఎం పదోన్నతుల్లో జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 94 జీహెచ్ఎం పోస్టులను భర్తీ చేయగా, 639 స్కూల్ అసిస్టెంట్లు, ఆ సమాన స్థాయి పదోన్నతులు కల్పించారు. అర్హులైన ఎస్‌జీటీల్లో పీఎస్ హెచ్ఎంలుగా 72 మందికి పదోన్నతులు కల్పించగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయో సైన్స్‌లో 40 మందికి, ఇంగ్లీష్‌లో 39, మ్యాథమెటిక్స్‌లో 30, ఫిజికల్ సైన్స్‌లో 9, సోషల్ స్టడీస్‌లో 49, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఒకరికి పదోన్నతులు లభించాయి. భాషా పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌తో జిల్లాలో హిందీలో 142, తెలుగులో 148, ఉర్దూలో 2, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 37 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. కాగా, తాజాగా సోమవారం జిల్లాలో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఆ సమాన స్థాయి 70 పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తూ విద్యా శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. సోమవారం మహేశ్వరంలోని వత్తుల రఘుపతి భవన్‌లో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామపంచాయితీల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ సత్తా ఏమిటో నిరూపించుకునే అవకాశం కార్యకర్తలకు ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన మోసాలను ఎండగడుతూ కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని వివరించాలన్నారు. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి మహేశ్వరంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, త్వరలో మహేశ్వరం ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో నిరాశతో సమావేశం నుంచి బయటకువెళ్లారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోగా కేఎల్లార్ అందరినీ కలుపుకొని పోవాలని, లేనియెడల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లక తప్పదని సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు చర్చించుకున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా మహేశ్వం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ఉండడంతో.. అధ్యక్ష పదవి రేసులో మండలానికి చెందిన నాయకులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, సురేందర్‌రెడ్డి, ఎ.ప్రశాంత్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మంత్రి బాల్‌రాజ్, ప్రభునాయక్, అంజయ్య, నర్సింహ, యాదయ్య, రాజు, ప్రవీణ్, రవిందర్‌నాయక్‌లున్నారు. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో అంగోత్ కృష్ణానాయక్, నేనావత్‌రాజు, పాండునాయక్, సేవ్యానాయక్, విఠల్‌నాయక్, గోపాల్, హరిసింగ్ తదితరులు పోటీలో ఉన్నారని, వీరందరి పేర్లను వారి వారి గ్రామాల కార్యకర్తలతో చర్చించి పదవులను కేటాయిస్తామని కేఎల్లార్ తెలిపారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి


మోమిన్‌పేట్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

మోమిన్‌పేట్, జూలై 29: ఫర్టిలైజర్స్ దుకాణా దారులు రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కేతకి సంగమేశ్వర్ ఫర్టిలైజర్ దుకాణంతో పాటు దేవరంపల్లి, చక్రంపల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. వర్షాకాలం సీజన్ పంటలసాగుకు రైతులకు అవసరపడే యూరియా, డీఏపీ, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించడంతో పాటు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రశీదులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులు రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగలతో అప్రమత్తంగా ఉండాలి


కీసర సంతలో సైకిల్‌పై పెట్రోలింగ్ చేస్తున్న సీఐ వెంకటయ్య

కీసర, జూలై 29: దొంగలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీసర పోలీస్ స్టేషన్ సీఐ వెంకటయ్య అన్నారు. కీసరలో సోమవారం జరిగిన సంతలో సీఐ సైకిల్‌పై పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ గ్రామపంచాయతీల్లో జరిగే సంతల్లో, రద్దీగా ఉండే ప్రదేశాల్లో దొంగలు వారి చేతివాటం చూపించే అవకాశముందన్నారు. దీంతో నగదు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకొని వారికి మాయమాటలు చెప్పి, విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్తున్నారన్నారు. సంతకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే 100 నెంబర్‌కు ఫోన్‌చేయాలని అటు చిరు వ్యాపారులకు, ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: దార్ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని పలు పోలీసుస్టేషన్ పరిధిల్లో దార్ గ్యాంగ్ కదలికలు సీసీ ఫుటేజీల్లో కనిపించాయని, రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు అనుమానంగా సంచరిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరు మృతి

● ముగ్గురికి గాయాలు


చెట్టును ఢీకొట్టిన కారు

మూడుచింతలపల్లి, జూలై 29: ప్రమాదవశాత్తు చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తుర్కపల్లి పరిధిలోని జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్‌సీపురానికి చెందిన రాజేశ్వర్‌రావు ఆదివారం తన భార్య విజయలక్ష్మి, కొడుకు ప్రవీణ్, కూతురు ప్రవళిక, అల్లుడు ప్రవీణ్‌లతో కలిసి కారులో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లి తిరిగి సోమవారం ఇంటికి వస్తున్నారు. తుర్కపల్లి గ్రామ పరిధిలోని అచ్చాయిపల్లి చెక్‌పోస్ట్ నుంచి సుమారు 100మీటర్ల దూరంలో ప్రమాదవశాత్తు రోడ్డుకు ఎడమ వైపు ఉన్న చెట్టును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న రాజేశ్వర్‌రావుతో పాటు అతడి కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓజోన్ ఆస్పత్రికి తరలించగా రాజేశ్వర్‌రావు మార్గమధ్యలో మృతిచెందాడు. గాయాలపాలైన వారికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కలదాడిలో లేగదూడకు గాయాలు


కుక్కల దాడిలో గాయాలపాలైన లేగదూడ

మేడ్చల్ టౌన్, జూలై 29: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కుక్కల దాడిలో లేగదూడకు తీవ్రగాయాలయ్యాయి. నరేందర్‌రెడ్డి అనే రైతులకు చెందిన ఆవు దూడపై సోమవారం కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. అదేవిధంగా బాసిరగడిలో ఆదివారం సాయంత్రం ఇద్దరు మహిళలను కుక్కలు దాడిచేశాయి. దీంతో స్థానికులు కుక్కలతో తమకు రక్షించాలని మున్సిపల్ అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


వెంకటేశ్వర్‌రావు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 29: ఘట్‌కేసర్, పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడని సీఐ రాజుశర్మ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని విహారిహోమ్స్‌లో నివాసముంటున్న దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు(72) ఈనెల 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రివరకూ తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పరిసరాలను వెతికి తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సోమవారం సాయంత్రం వెంకటేశ్వర్‌రావు కుమారుడు దేవులపల్లి అనంత్‌మారుతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు సీఐ సైదులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యనమాదిరి చెన్నయ్య(43) అనే వ్యక్తి భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని శివారెడ్డిగూడలో ఉంటూ టైలరింగ్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు నెలలుగా చెన్నయ్య టైలరింగ్ మానేయడంతో ఇంట్లో చిన్నపాటి గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం చెన్నయ్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకువెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పరిసరాల్లో వెతికినా, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతోఓ చెన్నయ్య భార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చెన్నయ్య

కత్తులతో ఇరువర్గాల దాడులు.. పలువురికి గాయాలు

మూడుచింతలపల్లి, జూలై 29: కత్తులతో ఇరువర్గాలు దాడులు చేసుకున్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లికి చెందిన జీడి మహేష్ తనకున్న స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈ స్థలంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నారని, ఇంటి నిర్మాణం సజావుగా సాగడం లేదని అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ క్రమంలో ఆ ఇంటి పక్కనే ఉన్న జీడి మల్లేష్ తననే తిడుతున్నాడని భావించి ఘర్షణకు దిగాడు. జీడి మహేష్ వెంటనే తనకు మద్దతుగా అతడి బామ్మర్దులు జూపల్లి మహేష్, జూపల్లి నాగరాజులను పిలిపించుకున్నాడు. ఈ క్రమంలో అదేగ్రామంలో ఉంటున్న జీడి నర్సింహ, జీడి బాబులను జీడి మల్లేష్ పిలిపించాడు. వారి మధ్య మాటామాట ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు తెచ్చుకున్న కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈదాడిలో జీడి నర్సింహ చేతికి గాయాలయ్యాయి. జీడి మహేష్‌కు ఛాతి భాగంలో, జూపల్లి మహేష్‌కు ముఖం భాగంలో గాయాలు కాగా వీరందరినీ చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూలై 29: కుటుంబ కలహాలతో రైలుకింద పడి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనగాం జిల్లా లింగాల ఘనాపూర్ మండలం వనపర్తికి చెందిన కాలి అయిలయ్య (65) జవహర్‌నగర్, బాలాజీనగర్‌లో ఉంటూ కూలీపనులు చేస్తుంటాడు. కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి మాదవరెడ్డి వంతెన వద్ద సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వేపోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధార్‌కార్డు ఆధారంగా కాలి అయిలయ్యగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 29: ఈనెల 25న అదృశ్యమైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యమైనట్లు ఘట్‌కేసర్ రైల్వేపోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా, అర్మూర్ మండలం, సుబ్రియాల గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి కుమారుడు పీసు వెంకట్‌రెడ్డి(19) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఈడబ్ల్యుఎస్ కాలనీలో అద్దెరూంలో నలుగురు మిత్రులతో కలిసి ఉంటూ కీసర మండలం, భోగారంలోని హోలీమేరి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 25న ఉదయం రూంలో తోటిమిత్రుడి సెల్‌ఫోన్ పోవడంతో ఎవరు తీశారో చెప్పాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో వెంకట్‌రెడ్డి భయాందోళనకు గురై కళాశాలకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగిరాలేదు. దీంతో స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మరుసటి రోజు అతడి మేనమామ జక్కా మనోహర్‌రెడ్డి కళాశాలలో, బంధుమిత్రుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వెంకట్‌రెడ్డి ఓ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని రైల్వే పోలీసుల గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం వెంకట్‌రెడ్డి తల్లిదండ్రులు కుమారుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కల్వర్టుపై వంతెన నిర్మించాలి


రాంనగర్ సమీపంలో గల కల్వర్టు

కులకచర్ల, జూలై 29: మండలంలోని రాంనగర్ గ్రామ సమీపంలో గల కల్వర్టుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. గ్రామానికి రెండు వైపులా కులకచర్ల-దాదాపూర్ రోడ్డులో కల్వర్టులు ఉన్నాయని తేలిక పాటి వర్షానికే వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు.

రోడ్డుపై చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చెత్తను తొలిగిస్తున్న పారిశుధ్య కార్మికులు

బషీరాబాద్, జూలై 29: 'చెత్తదారి!'అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో గాలి యాదయ్య స్పందించారు. ఈవిషయమై స్థానిక గ్రామ కార్యదర్శి జయకార్‌ను ఆరాతీసి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులను అక్కడికి పంపించి చెత్త తొలగింపజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

వానాకాలం పంటలపై ఆశలు


ధారూరు సమీపంలో కంది, పెసర చేను


ధారూరు, జూలై 29: వానాకాలం పంటలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జూన్ నెలలో విత్తనాలు విత్తగా ప్రస్తుతం పొలాలు పచ్చదనంతో నిండిపోయాయి. రెండు రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురువడంతో పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు. పత్తి, కంది, పెసర, మొక్కజొన్న పంటలు పంట పొలాల్లో పచ్చగా కనిపిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు పొలాల్లో కలుపుతీత పనులోట్ల నిమగ్నమయ్యారు. మరో వైపు పత్తికి ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతులు పిచికారి చేస్తున్నారు.

భర్త జ్ఞాపకార్థం చెట్టుకు పూజ


చెట్టుకు పూజలు చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కొట్రిక విజయలక్ష్మి

తాండూరు, జూలై 29: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి తన భర్త జ్ఞాపకార్థం ప్రతీ ఏడాది మాదిరిగానే సోమవారం తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నాటిన చెట్టుకు పూజలు చేశారు. ఎనిమిదేళ్ల కిందట విజయలక్ష్మి భర్త లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కొట్రిక వెంకటయ్య అనారోగ్యంతో ఉండగా తన ఇంటి ఎదుట మొక్కలను నాటారు. ఆయన మరణాంతరం ప్రతీ ఏడాది ఆ మొక్కనుపెంచుతూ పది సంవత్సరం కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి మొక్కకు బెలూన్లు పెట్టి పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ సీనియర్ విద్యావేత్త కీర్తి శర్మ తదితరులతో కలిసి ప్రత్యేకపూజలు చేశారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


విజయ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవాబుపేట, జూలై 29: తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముప్ప విజయ్‌బాబును కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్‌తో పాటు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, గోపాల్ తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి పట్ల సంతాపం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మోమిన్‌పేట్, జూలై 29: ఎన్కెపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొగులయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, నవాబుపేట పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీపరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కాళికాదేవి బోనాల జాతర


ఆదర్శ నగర్ కట్ట మైసమ్మ ఆలయంలో పారాయణం చేస్తున్న మహిళలు

తాండూరు, జూలై 29: పట్టణంలోని శాంత్‌మహల్ చౌరస్తాలో కొలువైన ప్రసిద్ధ కాళికాదేవి అమ్మవారి బోనాల జాతర ముగిసింది. రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరిగాయి. సోమవారం అమ్మవారికి ఊరేగింపు, ఉత్సవసేవ, అభిషేకం, పూజ కార్యక్రమంతో పాటు అన్నదానం నిర్వహించారు. ఆదివారం రాత్రి రంగమొక్కే కార్యక్రమానికి పట్టణంలోని పలు కాలనీల ప్రజలు తరలివచ్చి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ కమిటీ లేకుండానే బోనాల జాతర నిర్వహించారు. ఆదర్శనగర్ కట్టమైసమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి మహిళలు సమగ్ర పారాయణం నిర్వహించారు.

గ్రామ దేవతల అనుగ్రహంతోనే ఆరోగ్యం

దోమ: గ్రామ దేవతల అనుగ్రహంతోనే ప్రజలు ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో ఉంటున్నారని సర్పంచుల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు కె.రజీరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య అన్నారు. మండలంలోని లింగన్‌పల్లి గ్రామంలో బుధవారం జరగనున్న పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలతో విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు పురోహితులు శేషాద్రి రావు, లింగన్‌పల్లి గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిని బుచ్చయ్య, ఏరోళ్ల గోపాల్, కొండని నర్సిములు, మొగులయ్య, నారాయణ, బల్ల బుచ్చయ్య, నాగని హన్మయ్య, మైస వెంకటయ్య, రాములు, పోలీసు కానిస్టేబుల్ నర్సింహులు, నాగని పెంటయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


దోమ: పోచమ్మ తల్లి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

పింఛన్ల పెంపు ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే


జినుగుర్తిలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నర్సింహులు

తాండూరు రూరల్, జూలై 29: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రంలో పెన్షన్ల పెంపు జరిగిందని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ అన్నారు. మండలంలోని జినుగుర్తి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ దిమ్మెను నిర్మించి పి.నర్సింహులు మాదిగ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ, ఉప కులాల న్యాయమైన సమాన రిజర్వేషన్ల వాటా కోసం చేస్తున్న పోరాటం చివరిదశకు చేరుకుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ చొరవతో మందకృష్ణ మాదిగ పోరాటం వల్ల 29ఏళ్ల ఎస్సీ వర్గీకరణ సమస్య ఓ కొలిక్కి వచ్చిందని అన్నారు. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఏడుగురి ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై విచారణ పూర్తి చేసిందని, కేవలం జడ్జిమెంట్ రావాల్సి ఉందని అన్నారు. త్వరలోనే 30ఏళ్లపోరాటం విజయం సాధిస్తుందని అన్నారు. ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జినుగుర్తి గ్రామ కమిటీ సభ్యుడు జగదీష్ మాదిగ, దేవదాస్, బి.బాలప్ప, ఎం.వీరేశం, బి.ఏలియా, దేవప్ప, రవి, మానికప్ప, వెంకటేష్, జెర్నెప్ప, నర్సింహులు, బాలరాజుగౌడ్, కృష్ణ, అనంతయ్య, రాములు, రామప్ప, ముకుందు, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పర్యవేక్షణ అధికారులు కరువు


మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్

బొంరాస్‌పేట్, జూలై 29: వర్షాలు సకాలంలో కురవక ఎంతో మంది రైతులు అయోమయంలో ఉన్నా పంటల సాగులో సలహాలు, సూచనలు చేసే అధికారులే కరువయ్యారని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్ ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు సకాలంలో కురవక చెరువులు, కుంటలు, బావులు, బోర్లలో నీరు లేక వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు సాగు చేసిన పంటలకు భరోసా లేదంటూ ఆందోళనలో ఉన్నారన్నారు. ఎక్కడో దూరంగా ఉంటూ మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో సలహాలు, సూచనలు చేస్తూ చేతులు దులుపేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలు, తండాల్లో అధికారులు పర్యటించి రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు, చీడ పీడల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు

కులకచర్ల, జూలై 29: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు సూర్యకాంత్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు ఎల్లవేళలా ప్రజల్లో ఉండాలని, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో రైతు లకు పంట పెట్టుబడిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అందించలేదన్నారు. గ్రామా ల్లో రోడ్డు సౌకర్యం, కొత్త పింఛన్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు అందించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులకు పోటీ చేసే బీజేపీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు శివరాజ్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడ్, అంజిలయ్య, మైపాల్, కేశవులు, వెంకటేశ్, శ్రీనివాస్, జానకిరామ్, హనుమంతు, శంకర్ పాల్గొన్నారు.

మృతిచెందిన కూతురి అవయవదానం


దీపిక(ఫైల్)

మేడ్చల్ టౌన్, జూలై 29: కూతురు అకాల మరణంతో శోభించిన తల్లిదండ్రులు తమ కూతురు అవయవాలను ఇతరులకు దానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడ్చల్‌కు చెందిన శ్రీనివాస్, సరిత దంపతుల రెండవ కూతురు దీపిక(16)కు ఈనెల 22న ఆరోగ్యం క్షీణించటంతో నగరంలోని యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు జరిపిన వైద్యులు దీపిక బ్రేన్‌డెడ్ అయిందని తెలిపారు. అనంతరం దీపిక గత 25వ తేదీన మృతి చెందటంతో తల్లిదండ్రులు తమ కూతురు పది అవయవాలను ఇతరులకు దానం చేశారు. దీంతో ఆ ఆదర్శ దంపతులను పలువురు అభినందించారు.

డ్రైవర్లకు ప్రోత్సాహకాలు


పరిగి డిపోలో ప్రమాదరహిత డ్రైవర్లను సన్మానిస్తున్న డీఎం, ఎస్ఐలు

పరిగి, జూలై 29: ప్రమాదరహిత ఉత్తమ డ్రైవర్లకు ప్రోత్సాహకాలు ఉంటాయని పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ, ఎస్ఐ అన్వేష్‌రెడ్డి అన్నారు. ప్రమాదరహిత వారోత్సవాల్లో భాగంగా సోమవారం పరిగి డిపోలో ఉద్యోగ చరిత్రలో జీరో ప్రమాదాలు గల డ్రైవర్లకు అభినందన సభను నిర్వహించారు. ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలతోపాటు, సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సోంమ్లా, అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గం


సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఘట్‌కేసర్ మండల కార్యవర్గం

ఘట్‌కేసర్, జూలై 29: సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఘట్‌కేసర్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఘట్‌కేసర్ గురుకుల్ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట రంగయ్య, ఉపాధ్యక్షుడిగా యాదిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా బత్తుల మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీరాం సోమయ్య, ఎన్నారెడ్డి, కోశాధికారిగా జిల్లెల పోచిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.కృష్ణ, నాగరాజు, ముత్యాల్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారావు, ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి చౌదరి పాల్గొన్నారు.

బషీరాబాద్ ఏఎంసీ మెంబర్‌కు సన్మానం

బషీరాబాద్, జూలై 29: మార్కెట్ కమిటీ మెంబర్‌గా నియమితులైన షేక్ మునీర్‌ను మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పలువురు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువలతో సత్కరిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.రాకేష్, ఎస్.వెంకటేష్, రోహిత్, మస్తాన్, సిద్ధార్థ పాల్గొన్నారు.

ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చైర్మన్‌కు సన్మానం

పరిగి, జూలై 29: ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీస్, కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను సోమవారం పరిగి ముదిరాజ్ సంఘం నాయకులు కలిశారు. కొత్తగా చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సన్మానించారు. ముదిరాజ్‌లు, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని జ్ఞానేశ్వర్‌ను కోరారు. చైర్మన్ సన్మానించిన వారిలో పరిగి తాలుకా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రామస్వామి, నాయకులు కావలి సత్యనారాయణ, నాగేశ్వర్,చిన్ననర్సింహులు, వెంకటేశ్, రామకృష్ణ; బి.నర్సింహులు ఉన్నారు.

ఈవీఎల్ నూతన కార్యవర్గం

మేడ్చల్ టౌన్, జూలై 29: బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంభ ప్రభాకర్ ఆధ్వర్యంలోపారిశ్రామిక వాడలోని ఈవిఎల్ కార్మిక సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎన్నుకోగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ, సలహాదారులుగా ప్రభాకర్, రమేష్, నాగరాజు, ప్రధానకార్యదర్శిగా యాదగిరి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రావు, గోపాల్, చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోహన్‌రెడ్డి, సురేష్, జాయింట్ సెక్రటరీగా వెంకటేశ్వరావు, రాజేశ్వరావు, కార్యాలయ కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా జీవన్ రెడ్డిలను ఎన్నుకున్నారు.

ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫికెట్ అందజేత

నవాబుపేట, జూలై 29: హైదరాబాద్‌లోని మినర్వాగ్రౌండ్ స్టార్ హోటల్‌లో గత నెల రోజులుగా ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ తరగతుల్లో మేనేజ్‌మెంట్ బాడి లాంగ్వేజ్ వాయిస్ మెడిటేషన్ అబ్రేవేషన్ స్కిల్స్‌పై నవాబుపేట మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి కావడంతో సోమవారం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా మల్లేశం సర్టిఫికెట్‌ను అందుకున్నారు.